క్లుప్తంగా

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ముదిగొండ: ప్రతీ ఇంటిలో తప్పని సరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మేడేపల్లిలో శుక్రవారం ఇంటింటికీ తిరిగి ఇంకుడు గంతల నిర్మాణాలను పరిశీలించారు. నీటిని పొదుపుగా వాడుకుని, వాటిని ఇంకుడు గుంతలోకి చేరే విధంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రతి ఒక్కరు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ రాజు, ఎంపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్‌షాపు ప్రారంభం



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట–2 రేషన్‌షాపును తహసీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, ఆర్ఐ.జాని, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కె.అప్పారావు, కౌన్సిలర్ అద్దంకి అనీల్, డీలర్లు ఉషారాణి, రవికుమార్, వాసు, శోభారాణి పాల్గొన్నారు.

సీఐ వసంత్ కుమార్‌కు సన్మానం

మధిర: మధిర సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాటోత్ వసంత్ కుమార్‌ను స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం భారత జాగృతి మధిర నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొబ్బిళ్లపాటి బాబురావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు టీటీడీ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మధిర మండల అధ్యక్షులు పగిడిపల్లి వినోద్, కోట రాకేష్, సుధీర్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ



ఫ్రీజర్ బాక్స్‌ను అందిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలో బండి భద్రయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మి, కుమారుడు, కుమార్తె మాధవరావు, మాధవి రూ.80 వేలు విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి అప్పగించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దభద్రయ్య, మాజీ సర్పంచ్‌లు రంగారావు, వాసు, రైతుబంధు గ్రామ కోర్డినేటర్ గోపాలకృష్ణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష సమావేశం

వైరా: నేడు వైరా నియోజకవర్గంలోని అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.జగదీశ్వర ప్రసాద్ తెలిపారు. స్థానిక రైతు వేదిక భవనంలో ఈ సమావేశం ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ మధుసూధన్ హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు హాజరు కావాలని తెలిపారు.

వైరాలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: ఆకలితో అలమటించే వారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా వైరా లయన్స్‌క్లబ్ వారు మీల్స్ ఆన్ వీల్స్ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్ రావు అన్నారు. వైరాలో శుక్రవారం తడికమళ్ల రంగారావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు శ్రీనివాసరావు, రమేష్‌ల సహకారంతో వైరా పాత బస్టాండ్ రామాలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, నూకల శ్రీనివాసరావు, సత్యంబాబు, వెంకటేష్, రవి, నాగేశ్వరరావు, జగన్, దాతలు అనీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి

సత్తుపల్లిరూరల్: మండలంలోని సిద్దారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోళ్లమూడి కూనయ్య(79) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, డాక్టర్ రాగమయి, కొండూరు సుధాకర్, కోటూరి మానవతారాయ్, శివ వేణు, సాల్మన్‌రాజులు సందర్శించి పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు.ఆదినారాయణ, చెన్నారావు, శ్రీనివాసరావు, ప్రసాదరావు, కమల్‌పాషా, రఫీ, అప్పారావు, ధనుంజయరావు పాల్గొన్నారు.

నిర్మాణం.. నాసిరకం



నూతనంగా నిర్మిస్తున్న గాంధీపురం రైల్వే స్టేషన్

- వానకు కుప్పకూలిన రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం ప్రహరీ
- ఓ పక్క పనులు.. మరోపక్క పగుళ్లు
- సమారు రూ.9 కోట్లతో నిర్మాణం

కారేపల్లి: మండలంలోని చర్లపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న గాంధీపురం నూతన రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.9కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఇటీవల రెండు రోజులుగా కురిసిన ఓ మోస్తరు వర్షానికే.. గురువారం రాత్రి ప్లాట్‌ఫాం ప్రహరీ కుప్పకూలిపోగా, మరికొన్ని చోట్ల గోడకు బీటలువారాయి. ప్లాట్‌ఫాం సైతం పగుళ్లు ఏర్పడి కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంది. పర్యవేక్షణ చేపట్టాల్సిన రైల్వే అధికారులపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నాసిరకం పనులతోనే..

డోర్నకల్ జంక్షన్ నుంచి భద్రాచలం రోడ్డు రైల్వే ట్రాక్ వరకు నడుస్తున్న రైల్వేస్టేషన్ పనులు నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతో కొద్దిపాటి వార్షానికే రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం ప్రహరీ కుప్పకూలిపోయింది.

ఈ రైల్వే స్టేషన్ వద్ద లూప్ లైన్లను పెంచి.. కంకర, బొగ్గులను లారీల ద్వారా తీసుకొచ్చి బోగీల్లో డంపింగ్ చేసేందుకు రైల్వే అధికారులు నూతన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. కాగా.. ప్లాట్‌ఫాంకి చెరువు మట్టి వినియోగించటంతో పాటు, వైబ్రేటింగ్ చేపట్టకపోవటం, నాసిరక సిమెంట్ ఇటుకలు వాడటం, సమపాళ్లలో ఇసుక, సిమెంట్ కలపకుండా.. పూర్తిగా నాసిరక పనులను చేపట్టారు. దీనికి తోడు రైల్వే అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో.. నిర్మాణ బాధ్యులు ఇష్టానుసారంగా స్టేషన్ పనులను చేపట్టినట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా.. సంబంధిత రైల్వే అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, నాసిరక పనులు చేపడుతున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రహరీకు బీటలువారిన దృశ్యం



వానకు కుప్పకూలిన రైల్వేస్టేషన్ ప్రహరీ



బీటలువారిన రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం

పర్యవేక్షణ చేపట్టాలి..



పదికాలాల పాటు పటిష్టంగా ఉండాల్సి రైల్వే స్టేషన్ పనులను నాసిరకంగా నిర్మించడం సరికాదు. స్టేషన్ నిర్మాణానికి ఇసుకకు బదులు కంకరడస్ట్ వాడారని తెలిసింది. దాని కారణంగానే చిన్నపాటి వర్షానికే ప్లాట్‌ఫాం గోడ కుప్పకూలిపోయింది. ఇప్పటికైనా.. రైల్వే అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలి

– వేముల రామ్మూర్తి, సామాజిక కార్యకర్త, గాంధీపురం

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి



రఘునాథబంజర్‌లో ప్రచారంలో పాల్గొన్న అధ్యాపకులు

కల్లూరు: ప్రైవేట్‌కు దీటుగా నడుస్తున్న ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని కల్లూరు ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు అన్నారు. శుక్రవారం కళాశాలలో అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివితే చేకూరే ప్రయోజనాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఇప్పటి వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 85 మంది విద్యార్థులు చేరారు. ప్రిన్సిపల్ డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆధ్యాపకులు రెండు బృందాలుగా విడిపోయి పలు గ్రామాల్లోని విద్యార్థులను కలుసుకుంటున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.తిరుపతిరావు, అతహార్ అలీ, ప్రమీల, శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, వీరభద్రం, వరలక్ష్మి, ప్రసన్న, జ్యోతి, శ్రీరాములు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం



నాగిలిగొండ గ్రామంలో నీటి తొట్టిలో నీటిని తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు

చింతకాని: చింతకాని మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ... వర్షాకాల సీజన్ దృష్ట్యా గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇళ్లలో వాడుకున్న నీళ్లు రహదారులపైకి రాకుండా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇళ్ల పరిసరాల్లోని నీటితొట్లు, పాత కూలర్లు, రోళ్లు, పాతటైర్లలో నిల్వ ఉన్నటువంటి నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామపెద్దలు, వైద్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడిగా మారిన సర్పంచ్



చెత్త సేకరిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కొణిజర్ల: గత పదిరోజులుగా జీపీ కార్మికులు తమ సమస్యలపై సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు నిలిచిపోయాయి. దీంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో మండలంలోని పెద్ద మునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు పంచాయతీ కార్మికుడి అవతారమెత్తాడు. తానే ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికీ తిరుగుతూ శుక్రవారం చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాడు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మహబూబాబాద్ సభను జయప్రదం చేయండి



మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దశరథ్ నాయక్, నాయకులు

ఏన్కూరు: ఈ నెల 30న నిర్వహించే చలో మహబూబాబాద్ మహాసభను జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం లంబాడీ హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన ప్రజలను విచ్ఛిన్నం చేయాడానికి కుట్ర చేస్తుందన్నారు. ఎస్టీ జాబితాలో 11 బీసీ కులాన్ని చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలన్నారు. అనంతరం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు నగేష్‌నాయక్, పంతుల నాయక్, కృష్ణ నాయక్, మోహన్‌నాయక్, కేశవ్‌నాయక్, లకావత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంట చేసి వడ్డించిన తల్లిదండ్రులు



కూరగాయిలు కోస్తున్న తల్లిదండ్రులు

సత్తుపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం నుంచి సమ్మె చేస్తుండటంతో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కలిసి వంటచేసి వడ్డించిన సంఘటన సత్తుపల్లిలోని పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ పాఠశాలలో 270 మంది విద్యార్థులు ఉండగా పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు అందరు కలిసి తమ పిల్లలకు తామే వంట చేసుకొని వడ్డించుకుంటామని ప్రకటించారు. స్వయంగా వంట చేసి వరండాను శుభ్రం చేసి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సుమలత, మౌలాన్‌బీ, ఏసుమణి, వెలిశాల కుమారి, రమాదేవి, కరీమ, నాగుల్‌మీర పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్‌ను కలిసిన నంబూరి



ఈటెలను కలిసి అభినందనలు తెలుపుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ నెల 29న నిర్వహించే ఖమ్మం బహిరంగసభ గురించి చర్చించారు.

వాసిరెడ్డి రామనాథంకు సత్కారం

సత్తుపల్లిటౌన్: టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన వాసిరెడ్డి రామనాథాన్ని శుక్రవారం సత్తుపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు పోట్రు రామారావు, సరస్వతి, వినుకొండ రమేష్, రాంబాబులు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.సీతారాం, ప్రసాద్, చెన్నకేశవ్, మాధవి, రమ్య, కనకపూడి నాగార్జున పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పసుమర్తి చందర్‌రావు

కల్లూరు: ఆర్యవైశ్యుల సంక్షేమ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్య వైశ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆర్యవైశ్య రాజకీయ విభాగం మాజీ చైర్మన్ పసుమర్తి చందర్‌రావు పేర్కొన్నారు. గురువారం రాత్రి ఖమ్మంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు వనమా సూరి అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణను చందర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. చందర్‌రావు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులలో కూడా చాలా మంది పేద వారు ఉన్నారని, వారి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి రుణాలు అందజేసి వ్యాపారాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆర్యవైశ్యులు రాజకీయ రంగంలో వెనుకబడి ఉన్నారని, రాజకీయాలలో చురుకైన పాత్ర పోషిస్తూ ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేసారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనమా సూరిలను ఆర్యవైశ్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

సీపీఎం సోషల్ మీడియా కన్వీనర్‌గా హుస్సేన్‌రావు



మాట్లాడుతున్న సోషల్ మీడియా కన్వీనర్ హుస్సేన్‌రావు

ఎర్రుపాలెం: సీపీఎం మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా మీనవోలు గ్రామానికి చెందిన జువ్వ హుస్సేన్‌రావు నియమితులయ్యారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఈ మేరకు నియామకం జరిగినట్లు పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల రవి, సోమన్న, దివ్వెల వీరాంజనేయులు, షేక్ నాగుల్‌మీరా, దేవరకొండ రామకృష్ణ, షేక్ అన్వర్, దూదిగం బసవయ్య, సగుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకటరామయ్య, లాలా, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.లక్ష రుణమాఫీ చేయాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

బోనకల్: లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొంతు రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాయమాటలు కట్టిపెట్టి వెంటనే ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అనేక రకాల స్కీమ్‌లతో ప్రజలను మోసం చేసే ప్రక్రియను చేపడుతున్నాయని విమర్శించారు. అనేక మంది రైతులు నేటికి పాస్‌పుస్తకాల కోసం ప్రదక్షణలు చేస్తున్నారని, రెవెన్యూ అధికారుల తప్పిదాల వలన ఒకరి పొలాలు ఒకరికి ఎక్కి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ రమణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, తుళ్లూరి రమేష్, కందికొండ శ్రీను, జొన్నలగడ్డ సునీత, కందిమళ్ళ రాధ, నాగేశ్వరరావు, పంతు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా అశోక్



అశోక్

తల్లాడ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడిగా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇసినేపల్లి అశోక్ మాదిగను నియమిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శుక్రవారం మందా కృష్ణ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు

చింతకాని: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో ఆస్పత్రి వైద్యులు సుమారు 300 మంది రోగులకు పలు రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యశోద ఆస్పత్రి వైద్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్రీనివాసరెడ్డి, కృష్టారెడ్డి, శివారెడ్డి, వెంకటరెడ్డి, ఫకీర్‌సాహెబ్, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో ఆయుర్వేద వైద్య శిబిరం..

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ శీలం జయలక్ష్మి, జెడ్పీటీసీ కవిత లాంఛనంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో 62 మంది రోగులకు డాక్టర్ వెంకట్‌లాల్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ దొడ్డా అశోక్, ఏఎన్‌ఎం రేఖా ఇందిర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ/సత్తుపల్లిరూరల్: తల్లాడ మండలంలోని కుర్నవల్లి సబ్ స్టేషన్‌లో, సత్తుపల్లి మండలంలోని గౌరిగూడెం పరిధిలోని కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఏఈలు తెలిపారు. తల్లాడలోని.. కుర్నవల్లి, ముద్దునూరు, కలకొడిమ, బస్వాపురం, రంగాపురం, కేశ్వాపురం, పుణ్యపురం, గ్రామాలకు కరెంట్ ఉండదని కుర్నవల్లి సెక్షన్ ఏఈ సుందర్ కుమార్ పేర్కొన్నారు. సత్తుపల్లిలోని గౌరిగూడెం, రాజీవ్‌నగర్, రేజర్ల, కొత్తూరు, తుంబూరు, నారాయణపురం, సదాశివునిపాలెం, సర్వారాయషుగర్స్‌లకు విద్యుత్ నిలిపుతున్నట్లు ఏఈ శరత్‌బాబు తెలిపారు.

గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వాలి



పాలడుగులో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

వైరారూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పాలడుగు గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించారు. కార్యక్రమంలో షేక్.అబ్దుల్ రెహమాన్, సత్యనారాయణ, రహీన, మజీద్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.


గోరింటాకు పండుగ



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

మధిర: తెలంగాణ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి ఆదేశాల మేరకు శుక్రవారం మధిర పట్టణంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గోరింటాకు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కుంచం మల్లేశ్వరి మాట్లాడుతూ.. సాంప్రదాయ పండుగలను ప్రతీ ఒక్కరు గౌరవించాలన్నారు.

శాకంబరీ దేవిగా వాసవి మాత



శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

మధిర: మధిర పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వాసవి మాతను శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. ఆషాడ మాసం సందర్భంగా మూడు రోజులపాటు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



భాస్కర్‌కు రూ.30 వేలు నగదును అందిస్తున్న దృశ్యం

కారేపల్లి: చీమలపాడు ఘటనలో కాలు కోల్పోయిన మండలంలోని రేలయాయలపల్లి పంచాయతీ తవిసిబోడు గ్రామానికి చెందిన తేజావత్ భాస్కర్‌కు టీఎస్‌టీటీఎఫ్ ఆధ్వర్యంలో రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సాయాన్ని టీఎస్‌టీటీఎఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వీరునాయక్, భూక్యా మంగ్యానాయక్, స్థానిక సర్పంచ్ భూక్యా రమణల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటామని, తవిసిబోడు పాఠశాలలో చదువుతున్న ఆయన ఇద్దరు చిన్నారులకు స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. అనంతరం సర్పంచ్ రమణ క్వింటా బియ్యం అందించారు. కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ మండల అధ్యక్షుడు వీరు నాయక్, ఉపాధ్యాయులు దేవ్‌సింగ్, ఉప సర్పంచ్ రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



త్రిమాతలకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఏన్కూరు: మండల కేంద్రంలోని సాయిబాబా మందిర ప్రాంగణంలో కొలువు దీరిన త్రిమాతకు శుక్రవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకము, పుష్పాభిషేకము పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమాతకు మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సయ్య, అర్చకులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామం బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10వేల విలువైన నోట్ పుస్తకాలను దాత తల్లపురెడ్డి సుధాకర్‌రెడ్డి వితరణ చేశారు. ఈ పుస్తకాలను పాఠశాలలో విద్యార్థులకు ఎస్సై ఎం.సురేష్, సర్పంచ్ జంగా పుల్లారెడ్డిలు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం లైబ్రరీ బుక్స్ రాక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి, హెచ్‌ఎం గురునాథరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ పాపిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొమ్మిదో రోజుకు చేరిన జీపీ వర్కర్ల సమ్మె



తల్లాడ: జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన పొంగులేటి సుధాకర్‌రెడ్డి, నాయకులు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు పలు రాజకీయ పార్టీలు, పలు ప్రైవేట్ సంఘాల ఆధ్వర్యాన నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్